TGTEL/26/A4985

# ఆదాబ్ సైబరాబాద్

ADAAB CYBERABAD

www.adaabcyberabad.com
epaper.adaabcyberabad.com
adaabcyberabad@gmail.com

**విలేకరులు కావలెను**

అనుభవజ్ఞులైన జర్నలిస్టుల సారథ్యంలో
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రెండు తెలుగు రాష్ట్రాలలో
అతితక్కువ సమయంలో గుర్తింపు,
ప్రజాధరణ పొందిన ప్రింట్ - డిజిటల్ పత్రిక
రంగంలో ముందుకు దూసుకువెళుతూ..
అందరినీ ఆకట్టుకున్న
'ఆదాబ్ సైబరాబాద్'
దిన పత్రిక.

1. జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్
2. జిల్లా ఫోటో గ్రాఫర్స్
3. ఆర్. సీ ఇన్చార్జులు
4. మండల రిపోర్టర్స్
5. క్రైమ్ రిపోర్టర్స్

అనుభవజ్ఞులకు ప్రాధాన్యం అలాగే నూతన అభ్యర్థులకు అవకాశం కల్పించబడును.

సంప్రదించాల్సిన నెంబర్
8686861338

ఎడిటర్ : బిఎస్ శివ కుమార్ | సంపుటి : 1 | సంచిక : 53 | శనివారం, సెప్టెంబర్ 05, 2026, | పేజీలు - 4 | వెల: 5/-

EDITOR : BILLALPURSARA SHIVA KUMAR | VOLUME : 1 | ISSUE: 53 | 05-09-2026 (SATURDAY) | PAGES: 4 | RS : 5/-

## కొండా సురేఖ తొలగింపు నిర్ణయం బాధాకరమన్న టీపీసీసీ చీఫ్

## సీఎం రేవంత్ రెడ్డి ఎవరినీ బ్లాక్‌మెయిల్ చేయరని స్పష్టీకరణ




హైదరాబాద్ :కొండా సురేఖ తొలగింపుపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందనఅయితే పార్టీ క్రమశిక్షణే అత్యంత ముఖ్యమని స్పష్టీకరణ హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవని హెచ్చరికపార్టీలోనే కొనసాగితే సురేఖకు అవకాశాలు ఉంటాయని సూచనతెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించడంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ నిర్ణయం బాధ కలిగించేదే అయినా, పార్టీ క్రమశిక్షణే అత్యంత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకుంటుందని తేల్చిచెప్పారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.కొండా సురేఖ కుమార్తె సుస్మిత పార్టీపై చేసిన తీవ్ర వ్యాఖ్యలను సురేఖ వెంటనే ఖండించకపోవడాన్ని ఏఐసీసీ చాలా తీవ్రంగా పరిగణించిందని మహేశ్ గౌడ్ తెలిపారు. ఆమె వైఖరి అభ్యంతరకరంగా ఉందని, అందుకే క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా అధిష్ఠానం ఈ చర్యలు తీసుకుందని వివరించారు. పార్టీలో ఏవైనా సమస్యలు ఉంటే చర్చించడానికి పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, ప్రధాన కార్యదర్శి వంటి అనేక అంతర్గత వేదికలు ఉన్నాయని గుర్తుచేశారు. వాటిని కాదని బహిరంగంగా మీడియాతో మాట్లాడటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు."కాంగ్రెస్ పార్టీలో ఏ నాయకుడైనా మాట్లాడేటప్పుడు హద్దులు దాటితే చర్యలు తప్పవు" అని ఆయన అన్నారు. అయితే, కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆమె పార్టీలో ఉంటే భవిష్యత్తులో తప్పకుండా అవకాశాలు లభిస్తాయని సూచనప్రాయంగా చెప్పారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎవరినీ రాజకీయంగా బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా పార్టీ బీసీలకు ప్రాధాన్యత ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా ఉన్న కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.

## 2027 ఫిబ్రవరి వరకు

## ఎల్ నినో ఉద్ధృతి

### - భారత్‌కు పొంచి ఉన్న ముప్పు




న్యూ ఢిల్లీ : ప్రపంచ వ్యాప్తంగా చూస్తున్న వాతావరణ మార్పులు రానున్న రోజుల్లో మరింత దారుణంగా మారబోతున్నాయా? మన దేశంలో వర్షాలు తగ్గి, ఎండ తీవ్రత ఊహించని స్థాయిలో పెరగబోతోందా? అవుననే అంటోంది ప్రపంచ వాతావరణ సంస్థ. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన 'ఎల్ నినో' పరిస్థితులు మరింత తీవ్రరూపం దాల్చి, ఫిబ్రవరి 2027 వరకు కొనసాగే అవకాశం ఉందని డబ్ల్యూఎంఓ హెచ్చరించింది. దీనివల్ల వర్షపాతం, ఉష్ణోగ్రత సరళిపై గణనీయమైన ప్రభావం పడవచ్చునని పేర్కొంది. అలాగే వరదలు, కరవు, తీవ్రమైన వేడి వంటి ప్రమాదాలు కూడా తలెత్తవచ్చని ఆ సంస్థ వెల్లడించింది. ఈ దీర్ఘకాలిక ఎల్ నినో ప్రభావం భారత్ వాతావరణంపై, ముఖ్యంగా వర్షపాతం, వ్యవసాయ రంగాన్ని ఎలా దెబ్బతీయబోతోందో ఇప్పుడు ఈ కథనంలో చూద్దాం తెలుసుకుందాం.

## క్రమశిక్షణ చర్యల కింద కేబినెట్ నుంచి

## సురేఖకు ఉద్వాసన



హైదరాబాద్ : తెలంగాణ కేబినెట్ నుంచి ఉద్వాసనకు గురైన కొండా సురేఖ, తన పేరుతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. తన కుటుంబానికి సంబంధం లేని కొన్ని పోస్టులు వివిధ సోషల్ మీడియా వేదికలపై సర్క్యులేట్ అవుతున్నాయని, వాటితో తమకు ఎలాంటి సంబంధం లేదని శుక్రవారం ఆమె 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. "త్వరలో బిగ్ అప్‌డేట్", "నిరీక్షణకు తెరపడనుంది" వంటి వ్యాఖ్యలతో ఉన్న పోస్టులు తన దృష్టికి వచ్చాయని, వాటిని ఎవరూ నమ్మవద్దని కోరారు. తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల వివరాలను సైతం ఆమె పంచుకున్నారు.మంత్రి పదవి నుంచి తనను తొలగించిన మరుసటి రోజే ఈ ప్రచారం జరగడం గమనార్హం. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన సిఫార్సు మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గురువారం కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆమోదం పొందిన తర్వాతే సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారు. గత రెండు, మూడు రోజులుగా ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌లతో సహా రాష్ట్ర నాయకత్వంతో అధిష్ఠానం జరిపిన సంప్రదింపుల తర్వాత ఈ చర్యలు తీసుకున్నారు.గత నెలలో వరంగల్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేశారు. సీఎం కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు కూడా చేశారు. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికే ఓటు వేయాలని సీఎం పిలుపునివ్వడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకాశ్ రెడ్డి బరిలో ఉన్నా, తాను పరకాల నుంచి పోటీ చేస్తానని సుస్మిత ప్రకటించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ సంఘం సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిని చేయలేరని సురేఖ ఇచ్చిన సమాధానంపై పార్టీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. క్రమశిక్షణ సంఘం ఆమెపై కఠిన చర్యలకు సిఫార్సు చేసింది.

## సన్నబియ్యం అమ్మితే

## రేషన్ కార్డు తొలగిస్తాం



ఖమ్మం జిల్లా, సెప్టెంబర్ 4, : సన్నబియ్యం అమ్మితే రేషన్ కార్డు తొలగిస్తామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గుడిసెలో ఉండే ప్రతి ఒక్కరికీ ఇప్పుడే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని.. ఇందుకు పార్టీతో పని లేదని.. పేదవారైతే అర్హుడే అని స్పష్టం చేశారు. ఇళ్లు లేని వారికి ఇళ్లు ఇవ్వకపోతే సర్పంచ్ పదవి పోతుందని చెప్పుకొచ్చారు. రఘునాథపాలెం మండలం పుటాని తండాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు (శుక్రవారం) శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అటవీ శాఖ అధికారి అనూజ్ అగర్వాల్, భద్రాచలం ఐటీడీఏపీవో రాహుల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు.పోడు భూముల సమస్య పరిష్కరిస్తా..పోడు భూముల సమస్య పరిష్కరిస్తానని మంత్రి తుమ్మల మాటిచ్చారు. కేవలం వ్యవసాయం మీదనే బతికే కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ ఏడాది వర్షాలు పడే అవకాశం తక్కువగా ఉందని... వేసిన పంటలు పండే ఛాన్స్ లేదని తెలిపారు. తీవ్రమైన కరువు వచ్చే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారని అన్నారు. నీళ్లు లేకపోయినా బతికే పంట ఫామ్ ఆయిల్ అని చెప్పారు. పామాయిల్ పంట వేస్తే అన్నీ ఉచితం గా ఇస్తామని స్పష్టం చేశారు. రఘునాథపాలెం మండలానికి ఈ రాత్రికి నీళ్లు వదులుతున్నామని, రేపు మోటార్లు ఆన్ చేసుకోవాలని అన్నారు. ఆఫ్ ఎక్స్‌లెన్సీ పాఠశాల కూడా రాబోతుందని వెల్లడించారు. వందల కోట్లు పెట్టి పిల్లల కోసం ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేస్తుంటే.. తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలకు పంపిస్తున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## కొడంగల్‌లో పలు అభివృద్ధి పనులు

## పరిశీలించిన సీఎం

### ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఆదేశం



కొడంగల్:కొడంగల్‌ను అభివృద్ధి బాట పట్టించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ దిశగా ముందుకెళ్తున్నారు. అధికారులతో నిరంతర పర్యవేక్షణతోపాటు సీఎం సైతం వరుస పర్యటనలతో పనుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. మొదట నారాయణపేట జిల్లా మద్దూరు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాలను పరిశీలించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా నిర్మాణాలు ఉండాలని అధికారులకు సూచించారు. నిర్ణీత గడువులోగా భవన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అక్కడి నుంచి సాం?ఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను పరిశీలించిన ముఖ్యమంత్రి నిర్మాణం పురోగతిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం మద్దూరులోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. పదేళ్ల క్రితం ప్రజల అవసరాల కోసం తన సొంత డబ్బులతో భూమిని సీఎం కొనుగోలు చేశారు. అదే స్థలంలో ఇప్పుడు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నారు. ఆనాడు ముందుకొచ్చి భూములు ఇచ్చిన రైతులను గుర్తించి ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.దౌలతాబాద్ మండలం గోకఫసల్వాడ్ చేరుకున్న సీఎం నిర్మాణంలో ఉన్న బీసీ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులపై అధికారులను ఆరా తీశారు. అనంతరం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట్‌లో ఎడ్యుకేషన్ హబ్‌కు సీఎం వెళ్లారు. ఒక్కో ప్రాజెక్టు పనుల్లో పురోగతిపై ఆరా తీశారు. యంగ్ ఇండియా స్కూల్, ప్రభుత్వ మెడికల్ నర్సింగ్ స్కూల్ ఫిజియో థెరపీ, పారామెడికల్ కాలేజీల నిర్మాణాల వద్ద కలియ తిరుగుతూ వివరాలు తెలుసుకున్నారు. వర్షాల సమయంలో నీరు నిలవకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్?ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి ల్యాండ్ స్కేపింగ్ పనులకు వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

## దమ్ముంటే హరీశ్ రావు భార్య

## నాపై పోటీ చేయాలి



హైదరాబాద్ తెలంగాణలో రాజకీయ ప్రత్యర్థుల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు తీవ్ర స్థాయికి చేరాయి. నూతనంగా తెలంగాణ రక్షణ సేన పార్టీని స్థాపించిన కల్వకుంట్ల కవిత... బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు లక్ష్యంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో ధైర్యముంటే హరీశ్‌రావు తన భార్యను తనపై పోటీకి దింపాలని బహిరంగ సవాల్ విసిరారు. తనపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించిన కవిత... హరీశ్‌రావు నేరుగా బరిలోకి రాకుండా తెరవెనుక రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. అవసరమని భావిస్తే రాజకీయాలను పక్కనపెట్టి ఆయన తన భార్యను బరిలోకి దించవచ్చని, ఆమె తనపై పోటీ చేసినా స్వాగతిస్తానని స్పష్టం చేశారు. గతంలో సిద్దిపేట నుంచి హరీశ్‌రావుపై పోటీ చేస్తానని చెప్పిన మాటను గుర్తు చేసిన కవిత... వచ్చే ఎన్నికల్లో తాను సిద్దిపేట లేదా బోధన్ నియోజకవర్గాల నుంచి పోటీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు సంకేతాలిచ్చారు..ఇదే సమయంలో ముఖ్యమంత్రి పదవిపై తన ఆకాంక్షను కవిత బహిరంగంగా వెల్లడించారు. తాను సీఎం కావాలని అనుకుంటున్నానని, ఆ పదవికి హుందాతనం, గౌరవం చాలా ముఖ్యమని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు బీజేపీతో రహస్య ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆరోపించారు.

## పీఆర్సీ, కరవు భత్యం తదితర అంశాలపై

## చర్చించనున్న సీఎం



అమరావతి:ఆంధ్రప్రదేశ్‌లోని ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో రేపు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. కొత్త పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) ఏర్పాటు, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ అమలుతో పాటు కరవు భత్యం బకాయిలు తదితర కీలక అంశాలపై ఈ భేటీలో సమగ్రంగా చర్చించనున్నారు. సచివాలయంలో ఏపీ జేఏసీ నాయకులు ఎ. విద్యాసాగర్, డీవీ రమణ, భారతీ ప్రసాద్ తదితరులు సీఎం చంద్రబాబును కలిశారు. ఉద్యోగ వర్గాల్లో నెలకొన్న ఆందోళనలను, ఆర్థికేతర సదుపాయాల పెండింగ్ అంశాలను విద్యాసాగర్ సీఎంకు వివరించి, తక్షణ పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి... ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అత్యంత కట్టుబడి ఉందో స్పష్టం చేశారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఉద్యోగులకు అందాల్సిన న్యాయమైన ప్రయోజనాలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని తెలిపారు.

## విద్యుత్ ఉత్పత్తి కోసమే

## నీటిని విడుదల చేయొద్దు




హైదరాబాద్ :కృష్ణా జలాల అంశంపై ప్రతిష్టంభన వీడలేదు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పూర్తి స్థాయి బోర్డు సమావేశంలో తేల్చాలని నిర్ణయించారు. రెండు రాష్ట్రాల తాగునీటి అవసరాలు, శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లోని నీటి నిల్వలపై చర్చించేందుకు హైదరాబాద్ జలసౌధలో జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయారు.మరోసారి భిన్నాభిప్రాయాలు :కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీశ్ కాంబోజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి తెలంగాణ ఇంజినీర్ ఇన్ చీఫ్ రమేశ్ బాబు, ఆంధ్రప్రదేశ్ ఈఎన్సీ నరసింహమూర్తితో పాటు రెండు రాష్ట్రాలకు చెందిన ఇంజినీర్లు హాజరయ్యారు. ప్రస్తుత నీటి లభ్యత, తాగునీటి అవసరాలు, శ్రీశైలం--నాగార్జునసాగర్ జలాశయాల పరిస్థితి, నీటి విడుదలపై సమావేశంలో చర్చ జరిగింది. కృష్ణా జలాల పంపిణీపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య మరోసారి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. వాడీవేడిగా కేఆర్ఎంబీ సమావేశం :రెండు రాష్ట్రాలు తమ వాదనలు బలంగా వినిపించడంతో సమావేశాలు వాడివేడిగా సాగింది. పోతిరెడ్డిపాడు, వెలిగొండ సహా ఇతర మార్గాల ద్వారా ఎక్కువ నీటిని తరలించుకుంటున్నారని తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. శ్రీశైలం వద్ద తెలంగాణ జలవిద్యుత్ ఉత్పత్తి చేసి దిగువకు నీటిని వాడుకుంటున్నారని ఏపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. నీటి వాటా విషయంలో ఇరు రాష్ట్రాలు తమ తమ వాదనలకే కట్టుబడటంతో ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో ఈ అంశాలను సెప్టెంబర్ నాలుగో వారంలో నిర్వహించే బోర్డు పూర్తి స్థాయి సమావేశంలో విస్తృతంగా చర్చించి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు.

TGTEL/26/A4985
ఆదాబ్ సైబరాబాద్
ADAAB CYBERABAD



## ఎస్ఐఆర్--2పై బీజేపీ కార్యకర్తలకు అవగాహన



**-ఓటరు జాబితా సవరణపై దీూా--1, దీూా--2లకు దిశానిర్దేశం**

**వికారాబాద్:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్--2 (ఎస్ఐఆర్--2)లో భాగంగా ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి పాండు గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి బీజేపీ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు రమేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ మాట్లాడుతూ ఎస్ఐఆర్--2లో భాగంగా చేపడుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై పార్టీకి చెందిన దీూా--1, దీూా--2లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండేలా, అనర్హుల పేర్లను గుర్తించేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన బీజేపీ దీూా--2లు, అలాగే వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాల దీూా--1లు రాములు, శ్రీకాంత్, కేశవ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎస్ఐఆర్--2 ప్రక్రియలో పార్టీ తరఫున చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఓటరు జాబితా పరిశీలన తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా గడ్డమీది బాలరాజు

**ఆదాబ్ సైబరాబాద్, మేడ్చెల్ :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా జగద్గిరిగుట్టలోని సంస్కృతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గడ్డమీది బాలరాజు ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించనున్న కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆయన సత్కారం అందుకోనున్నారు.

1999లో డిగ్రీ పూర్తి చేసిన వెంటనే బాలరాజు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బౌరంపేట ఉన్నత పాఠశాలలో విద్యా వాలంటీర్‌గా ఉపాధ్యాయ వృత్తిని ప్రారంభించారు. అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ బోటనీ, బీఎడ్ పూర్తి చేశారు. కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బోటనీ లెక్చరర్‌గా పనిచేశారు.

బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్ప, కూన మహాలక్ష్మినగర్ ప్రాంతంలో సంస్కృతి పాఠశాలను స్థాపించారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు అధికంగా నివసించే ఈ ప్రాంతంలో తక్కువ ఫీజులతో విద్యను అందిస్తూ ఎంతోమంది విద్యార్థులకు అండగా నిలుస్తున్నారు. పాఠశాల నిర్వహణ ద్వారా పలువురు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ సామాజిక బాధ్యతను చాటుకుంటున్నారు.



విద్యాబోధనతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ బాలరాజు ముందుంటున్నారు. స్థానిక అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు అవసరమైన కుర్చీలు, వంట సామగ్రి తదితరాలను అందజేస్తున్నారు. అలాగే రాజీవ్ గృహకల్ప, కూన మహాలక్ష్మినగర్ ప్రాంతాల్లో ప్రతి ఏడాది ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తూ ప్రజలకు సేవలందిస్తున్నారు.

విద్యారంగంలో చేస్తున్న సేవలు, సామాజిక కార్యక్రమాల్లో చూపుతున్న చొరవను గుర్తించిన ప్రభుత్వం 2026 సంవత్సరానికి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా బాలరాజును ఎంపిక చేసింది.

ఈ సందర్భంగా గడ్డమీది బాలరాజు మాట్లాడుతూ.. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం తనకు ఎంతో సంతోషంగా ఉందని, అదే సమయంలో తనపై బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు చెందిన పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు భవిష్యత్తులోనూ తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## కూరగాయలను తినలేకపోతున్నారా.. ఈ మార్గాలను ప్రయత్నించండి..

కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వింటూ ఉంటారు. అయితే కూరగాయలను నేరుగా తినడం ఇష్టం లేని వారు చాలామందే ఉంటారు. అలాంటి వారు తమ రోజువారీ ఆహారంలో కూరగాయలను సులభంగా చేర్చుకునేందుకు కొన్ని ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. కూరగాయలను బలవంతంగా తినకుండా, నచ్చిన రుచులు, రూపాల్లో ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా వాటిని ఎక్కువగా తీసుకునే అవకాశం ఉంటుంది. రోజుకు తొమ్మిది కప్పుల కూరగాయలు తీసుకోవడం ఆరోగ్యకరమైన వృద్ధాప్యానికి ఉపయోగపడుతుందని పోషకాహార నిపుణులు పేర్కొంటున్నారు. కూరగాయలను నేరుగా తినడం కష్టంగా అనిపిస్తే వాటితో జ్యూస్ తయారు చేసుకుని తీసుకోవచ్చు. ఉదాహరణకు టమాటా, క్యారెట్, బీట్‌రూట్‌తో తయారు చేసే జ్యూస్ రుచిగా ఉండటంతో పాటు కూరగాయలను ఆహారంలో చేర్చుకునే సులభమైన మార్గంగా ఉపయోగపడుతుంది. జ్యూస్ రూపంలో..పుదీనా, కొత్తిమీరతో తయారు చేసే జ్యూస్‌ను కూడా తీసుకోవచ్చు. రోజులో రెండు రకాల కూరగాయల జ్యూస్‌లు తీసుకోవడం ద్వారా గణనీయమైన మొత్తంలో కూరగాయలను ఆహారంలో చేర్చుకోవచ్చు. అయితే జ్యూస్ రూపంలో తీసుకోవడం వల్ల కూరగాయలు తినడం పూర్తిగా భర్తీ చేయకూడదని గుర్తుంచుకోవాలి. కూరగాయలను నేరుగా తినడం ఇష్టం లేని వారిలో చాలామందికి సలాడ్లు మాత్రం నచ్చుతాయి. అలాంటి వారు బొప్పాయి సలాడ్, ఆకుకూరల సలాడ్, దానిమ్మ-కీరదోస సలాడ్ వంటి వాటిని ప్రయత్నించవచ్చు. ఇలా సలాడ్ల రూపంలో కూడా రోజువారీ ఆహారంలో కూరగాయలు, ఇతర పోషక పదార్థాలను సులభంగా చేర్చుకోవచ్చు. సలాడ్లలో కూరగాయలను సహజ రూపంలో తీసుకోవడం వల్ల వాటిలోని పీచు పదార్థాన్ని పొందవచ్చు. అలాగే కూరగాయలలో ఉండే సహజమైన క్రంచ్, తాజాదనం సలాడ్లను మరింత ఆకర్షణీయంగా మారుస్తాయి. కూరగాయలను వండుకుని తినడం ఇష్టం లేని



వారికి సలాడ్లు మరో మంచి ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుంది. సలాడ్‌గా కూడా తీసుకోవచ్చు..
రోజువారీ ఆహారంలో చివరగా సాధారణ కూరగా లేదా భాజీగా కూరగాయలను తీసుకోవచ్చు. అంటే జ్యూస్, సలాడ్, వండిన కూర అనే మూడు రకాలుగా కూరగాయలను రోజంతా విభజించుకుని తీసుకోవచ్చు. ఇలా చేయడం ద్వారా ఒకేసారి పెద్ద మొత్తంలో కూరగాయలు తినాల్సిన అవసరం లేకుండా రోజువారీ ఆహారంలో వాటిని సులభంగా చేర్చుకోవచ్చు. కూరగాయలను ఎక్కువగా తీసుకోవాలనే లక్ష్యం మొదట్లో భారంగా అనిపిస్తుందని, అయితే వాటిని వివిధ రూపాల్లో రోజంతా విభజించుకుంటే సులభంగా అలవాటు చేసుకోవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. ఉదయం లేదా పగటిపూట తాజా కూరగాయల జ్యూస్, మరో సమయంలో రంగురంగుల సలాడ్, భోజనంలో వండిన కూరను చేర్చుకోవచ్చు. అయితే కూరగాయల జ్యూస్‌లు మాత్రమే తీసుకుంటూ, తాజా కూరగాయలను పూర్తిగా మానేయడం సరైన పద్ధతి కాదు. సలాడ్ల ద్వారా సహజమైన పీచు పదార్థాన్ని పొందవచ్చు. వండిన కూరగాయలు మెత్తగా మారడంతో రోజువారీ భోజనంలో వాటిని సులభంగా చేర్చుకోవచ్చు. అందువల్ల జ్యూస్, సలాడ్, వండిన కూర.. ఇలా వివిధ రూపాల్లో కూరగాయలను తీసుకోవడం మంచిది. కూరగాయలను తినడం ఇష్టం లేని వారు తమకు నచ్చిన రుచులు, పదార్థాలు, వంట విధానాలను గుర్తించి వాటికి అనుగుణంగా కూరగాయలను ఆహారంలో చేర్చుకోవడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

# ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా.. అయితే మీలో సోడియం లోపం ఉందని అర్థం.. ఉప్పు..

ఉప్పు.. మన రోజువారీ వంటల్లో తప్పనిసరిగా ఉపయోగించే పదార్థం. అయితే ఆరోగ్యంపై చర్చ వచ్చినప్పుడు ఉప్పును చాలామంది తప్పుగా చూస్తుంటారు. ముఖ్యంగా అధిక ఉప్పు తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయనే భయంతో కొందరు దాన్ని పూర్తిగా తగ్గించేందుకు ప్రయత్నిస్తారు. కానీ మన శరీరానికి సోడియం అనే ఖనిజం కూడా అవసరమే. శరీరంలో ద్రవాల సమతుల్యతను కాపాడటం, నరాల పనితీరుకు సహకరించడం, కండరాలు సరిగ్గా పనిచేయడం వంటి ముఖ్యమైన ప్రక్రియల్లో సోడియం కీలక పాత్ర పోషిస్తుంది. సాధారణంగా మనం తీసుకునే ఆహారం ద్వారా శరీరానికి తగినంత సోడియం అందుతుంది. అయితే ఎక్కువగా చెమట పట్టడం, తీవ్రమైన వ్యాయామం చేయడం, వేడి వాతావరణంలో ఎక్కువసేపు ఉండటం లేదా శరీరం నుంచి ద్రవాలు ఎక్కువగా కోల్పోవడం వంటి పరిస్థితుల్లో ఎలక్ట్రోలైట్ స్థాయిల్లో మార్పులు వస్తాయి. అలాంటి సమయంలో కేవలం నీరు తాగడం మాత్రమే సరిపోదని, శరీరంలోని ద్రవాలు, ఎలక్ట్రోలైట్లు, సోడియం మధ్య సమతుల్యత కూడా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. ఈ లక్షణాలు కనిపిస్తే..శరీరంలో సోడియం తక్కువగా ఉన్నప్పుడు కొన్ని సంకేతాలు కనిపిస్తాయి. అయితే ఈ లక్షణాలు కనిపించాయంటే తప్పనిసరిగా సోడియం లోపమేనని అర్థం కాదు. అయినప్పటికీ వాటిని నిర్లక్ష్యం చేయకుండా పరిస్థితిని గమనించడం అవసరం. ఎంత నీరు తాగినా దాహం తీరకపోవడం అలాంటి సంకేతాల్లో ఒకటిగా చెప్పవచ్చు. నీరు తాగిన వెంటనే మూత్రం రావడం, తరచూ దాహం వేయడం వంటి పరిస్థితులు ఉంటే శరీరంలో ద్రవాలు మాత్రమే కాకుండా ఎలక్ట్రోలైట్లు, సోడియం సమతుల్యతను కూడా పరిశీలించాల్సి ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. శరీరానికి తగిన హైడ్రేషన్ అంటే కేవలం నీరు తీసుకోవడం మాత్రమే కాదని, నీరు, ఎలక్ట్రోలైట్లు, సోడియం మధ్య సమతుల్యత కూడా అవసరమని చెబుతున్నారు. తీపి పదార్థాలపై కోరిక..
అదేవిధంగా అదుపు చేయలేని తీపి పదార్థాల కోరిక కూడా కొన్ని సందర్భాల్లో కనిపిస్తుంది. ముఖ్యంగా ఎక్కువగా చెమట పట్టిన



తర్వాత బిస్కెట్లు, స్వీట్లు వంటి వాటిని తినాలనే కోరిక పెరుగుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే ఇలాంటి కోరికలకు సోడియం స్థాయిల్లో మార్పులు కూడా ఒక కారణం అవుతాయని చెబుతున్నారు. అందుకే తీపి పదార్థాలపై కోరిక పెరిగినప్పుడు దాన్ని కేవలం స్వీట్ టూత్ గా భావించే ముందు ఆహారంలో తగినంత సోడియం, ఇతర ఎలక్ట్రోలైట్లు అందుతున్నాయా అనే విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తున్నారు. కండరాల్లో అకస్మాత్తుగా వచ్చే తిమ్మిర్లు కూడా మరో సంకేతంగా పేర్కొంటున్నారు. ముఖ్యంగా కాళ్ల కండరాలు పట్టేయడం, కాలివేళ్లు ముడుచుకుపోవడం, చేతి కండరాలు బిగుసుకుపోవడం లేదా పొట్ట కండరాలు గట్టిగా మారడం వంటి సమస్యలు కనిపిస్తాయి. ముఖ్యంగా మద్యం తీసుకున్న తర్వాత ఇలాంటి కండరాల తిమ్మిర్లు కనిపిస్తే కేవలం ఎక్కువ నీరు తాగడంపైనే దృష్టి పెట్టకుండా శరీరంలోని మొత్తం ద్రవాలు, ఎలక్ట్రోలైట్ల సమతుల్యతను కూడా పరిగణనలోకి తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. భయపడాల్సిన పనిలేదు..సోడియం విషయంలో పూర్తిగా భయపడాల్సిన అవసరం లేదని నిపుణులు చెబుతున్నారు. శరీరం స్వయంగా సోడియంను తయారు చేసుకోలేకపోవడంతో ఆహారం ద్వారా దాన్ని పొందాల్సి ఉంటుంది. అయితే సోడియం ఎక్కువగా తీసుకోవడం కూడా ఆరోగ్యానికి మంచిది కాదు. కాబట్టి దాన్ని పూర్తిగా దూరం పెట్టడం లేదా అవసరానికి మించి తీసుకోవడం కాకుండా వ్యక్తిగత అవసరాలను అర్థం చేసుకుని సరైన మోతాదులో తీసుకోవడం ముఖ్యం. ముఖ్యంగా ఎక్కువగా చెమట పట్టే పరిస్థితుల్లో లేదా శరీరం నుంచి ద్రవాలు కోల్పోయినప్పుడు కేవలం నీటిపైనే ఆధారపడకుండా ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కూడా గుర్తుంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అయితే తరచూ తీవ్రమైన దాహం, కండరాల తిమ్మిర్లు లేదా ఇతర అసాధారణ లక్షణాలు కనిపిస్తే స్వయంగా ఉప్పు తీసుకోవడం పెంచకుండా వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది.

# షుగర్ ఉన్నవారి ఆరోగ్యాన్ని కాపాడే పసుపు.. పరిశోధనల్లో తేలిన నిజం..

మధుమేహం రక్తంలో చక్కెర స్థాయిలను పెంచడమే కాకుండా రక్తనాళాలపై కూడా ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా దీర్ఘకాలం పాటు రక్తంలో చక్కెర అధికంగా ఉంటే రక్తనాళాల గోడల్లో మార్పులు రావడంతో పాటు గుండె సంబంధిత సమస్యల ముప్పు పెరుగుతుంది. అయితే వంటింట్లో సాధారణంగా ఉపయోగించే పసుపులో ఉండే కర్కుమిన్ అనే పదార్థం మధుమేహంతో దెబ్బతినే రక్తనాళాలకు కొంత రక్షణ కల్పిస్తుందని ఓ కొత్త అధ్యయనం సూచిస్తోంది. టైప్-1 మధుమేహం ఉన్న ఎలుకలపై నిర్వహించిన ఈ పరిశోధనలో కర్కుమిన్‌తో చికిత్స చేసిన తర్వాత రక్తనాళాల ఆరోగ్యంలో మెరుగుదల కనిపించింది. రక్తనాళాల్లో వాపు తగ్గడంతోపాటు కాల్షియం నియంత్రణ మెరుగుపడినట్లు పరిశోధకులు గుర్తించారు. అలాగే శరీరంలోని అతిపెద్ద బృహద్ధమని (అరోటా) నిర్మాణం, పనితీరులోనూ సానుకూల మార్పులు కనిపించాయి. ఎలుకలపై ప్రయోగం..టైప్-1 మధుమేహం రక్తనాళాలను ఎలా ప్రభావితం చేస్తుందో తెలుసుకోవడంపై పరిశోధన ప్రధానంగా దృష్టి సారించింది. రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువకాలం పాటు అధికంగా ఉండటం వల్ల రక్తనాళాల గోడల్లో మార్పులు వస్తాయి. అలాగే రక్తనాళాలు కుచించుకోవడం, తిరిగి విస్తరించడం వంటి ప్రక్రియలు కూడా ప్రభావితమవుతాయి. కాలక్రమేణా ఈ మార్పులు గుండె, రక్తనాళాలకు సంబంధించిన వ్యాధుల ముప్పును పెంచే అవకాశం ఉంటుంది. ఈ ప్రభావాలను కర్కుమిన్ తగ్గించగలదా అనే విషయాన్ని పరిశీలించేందుకు టైప్-1 మధుమేహం ఉన్న మగ ఎలుకలను పరిశోధకులు ఉపయోగించారు. వాటిలో ఒక వర్గానికి 28 రోజుల పాటు కర్కుమిన్ ఇచ్చారు. మరో మధుమేహం ఉన్న ఎలుకల వర్గానికి కర్కుమిన్ ఇవ్వలేదు. అనంతరం వాటి రక్తనాళాలను, ముఖ్యంగా బృహద్ధమనిని పరిశీలించారు. మెరుగుపడిన రక్తనాళాల పనితీరు..28 రోజుల చికిత్స అనంతరం కర్కుమిన్ తీసుకున్న ఎలుకల్లో రక్తనాళాల పనితీరు మెరుగుపడినట్లు గుర్తించారు. వాపు, కాల్షియం కార్యకలాపాలు, అలాగే హీట్ షాక్ ప్రోటీన్ 70 అనే ప్రోటీన్‌లోనూ మార్పులను పరిశోధకులు




గమనించారు. కణాలను ఒత్తిడి నుంచి రక్షించడంలో, రక్తనాళాల పనితీరును నియంత్రించడంలో ఈ ప్రోటీన్ కీలక పాత్ర పోషిస్తుంది. పసుపులో ఉండే కర్కుమిన్‌కు యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నట్లు ఇప్పటికే తెలుసు. అయితే ఈ అధ్యయనం ప్రకారం మధుమేహం సందర్భంలో దాని ప్రభావం కేవలం వాపును తగ్గించడం, ఆక్సిడేటివ్ ఒత్తిడిని నియంత్రించడం వరకే పరిమితం కాదని తెలుస్తోంది. దీర్ఘకాలిక మధుమేహం శరీరంలో వాపు స్థాయిలను పెంచుతుంది. ఇది రక్తనాళాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఈ పరిశోధనలో కర్కుమిన్ తీసుకున్న ఎలుకల్లో వాపుతో సంబంధం ఉన్న కొన్ని సూచికలు తగ్గినట్లు గుర్తించారు. రక్తనాళాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో వాపు తగ్గడం కూడా ఒక కారణం అవుతుందని పరిశోధకులు భావిస్తున్నారు. కాల్షియం అయాన్లు కీలకం..
రక్తనాళాల కండరాలు కుచించుకోవడానికి, తిరిగి సడలడానికి కాల్షియం అయాన్లు కీలకం. మధుమేహం కారణంగా ఈ ప్రక్రియలో అసమతుల్యత ఏర్పడుతుంది. దీంతో రక్తనాళాలు అవసరానికి మించి స్పందించడం లేదా ఎక్కువగా కుచించుకోవడం జరుగుతుంది. అయితే కర్కుమిన్ ఇచ్చిన ఎలుకల్లో బృహద్ధమనిలో కాల్షియం కదలికలు కొంత సాధారణ స్థితికి వచ్చినట్లు పరిశోధకులు గుర్తించారు. ఇది రక్తనాళాల పనితీరు మెరుగుపడటంతో సంబంధం కలిగి ఉన్నట్లు తేలింది. అదే విధంగా కర్కుమిన్ హెచ్ఎస్‌పీ70 సమతుల్యతను కూడా ప్రభావితం చేసినట్లు అధ్యయనం తెలిపింది. మధుమేహంలో కణాల లోపల, రక్తంలో ఉండే హెచ్ఎస్‌పీ70 స్థాయిల మధ్య అసమతుల్యత ఏర్పడుతుంది. కర్కుమిన్ తీసుకున్న ఎలుకల్లో బృహద్ధమనిలో కణాలను రక్షించే హెచ్ఎస్‌పీ70 పెరగగా, రక్తంలో తిరుగుతున్న హెచ్ఎస్‌పీ70 తగ్గినట్లు గుర్తించారు. దీంతో మధుమేహం లేని ఎలుకల్లో కనిపించే స్థాయిలకు ఈ సమతుల్యత కొంతవరకు చేరువైంది. మధుమేహం రక్తనాళాల గోడల నిర్మాణాన్ని కూడా మారుస్తుంది. ముఖ్యంగా కొల్లాజెన్, ఎలాస్టిన్ వంటి పదార్థాల్లో మార్పులు వస్తాయి. ఎలాస్టిన్ రక్తనాళాలు సాగేలా ఉండేందుకు సహాయపడితే, కొల్లాజెన్ వాటికి బలాన్ని అందిస్తుంది. కర్కుమిన్ ఇచ్చిన ఎలుకల్లో అధికంగా పేరుకుపోయిన కొల్లాజెన్ తగ్గడంతో పాటు ఎలాస్టిన్ స్థాయిలు కూడా మెరుగుపడినట్లు పరిశోధకులు గుర్తించారు. దీని ద్వారా రక్తనాళాల నిర్మాణం, పనితీరును కాపాడటంలో కర్కుమిన్‌కు కొంత ప్రయోజనం ఉంటుందని సూచించారు. ఇంకా స్పష్టంగా తెలియాలి..అయితే ఈ పరిశోధన ఫలితాలను ఆధారంగా చేసుకుని పసుపు తినడం ద్వారా మధుమేహాన్ని నయం చేయవచ్చని లేదా దాని సమస్యలను నివారించవచ్చని చెప్పడం మాత్రం సరికాదు. ఈ అధ్యయనం మనుషులపై కాకుండా టైప్-1 మధుమేహం ఉన్న ఎలుకలపై నిర్వహించారు. ఎలుకలకు నియంత్రిత మోతాదులో కర్కుమిన్ ఇచ్చారు. అందువల్ల ఆ పరిశోధనలో కనిపించిన ప్రభావాలు మనుషుల్లో సాధారణంగా వంటల్లో ఉపయోగించే కొద్దిపాటి పసుపుతోనూ అదే విధంగా కనిపిస్తాయని చెప్పలేం. అంతేకాకుండా పసుపు, కర్కుమిన్ సప్లిమెంట్లు రెండూ ఒకేలా ఉండవు. పసుపులో కర్కుమిన్‌తో పాటు మరెన్నో సహజ పదార్థాలు ఉంటాయి. మరోవైపు కర్కుమిన్ సప్లిమెంట్లలో దాని సాంద్రత చాలా ఎక్కువగా ఉంటుంది. కర్కుమిన్ శరీరంలోకి పూర్తిగా శోషించబడే సామర్థ్యం కూడా తక్కువగా ఉండటం వల్ల మనుషులకు ఎంత మోతాదు ప్రభావవంతంగా, సురక్షితంగా ఉంటుందో ఇంకా స్పష్టంగా తెలియాల్సి ఉంది. అందువల్ల మధుమేహం ఉన్నవారు పసుపును సమతుల్య ఆహారంలో భాగంగా తీసుకోవాలి. అయితే పసుపు లేదా కర్కుమిన్‌ను మధుమేహానికి సూచించిన మందులు, ఇన్సులిన్, క్రమం తప్పకుండా చేసే శారీరక భావించకూడదు.

# కొండా సురేఖ రాజకీయ ప్రస్థానం: వైఎస్ కోసం పదవి త్యాగం.. రేవంత్ సర్కారులో పదవికి ఎసరు



హైదరాబాద్ :రాజకీయాల్లో విజయాల కంటే వివాదాలతోనే ఎక్కువగా వార్తల్లో నిలిచే నేతగా కొండా సురేఖ రాజకీయ ప్రయాణం సాగింది. మూడు దశా బ్దాల రాజకీయ జీవితంలో పార్టీ మార్పులు, సం చలన నిర్ణయాలు, వివాదాస్పద వ్యాఖ్యలతో ఆమె నిత్యం వార్తల్లోని వ్యక్తిగా మారారు. తాజా గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యల వివాదం చిలికి చిలికి గాలివానగా మారి, చివరికి ఆమె మంత్రి పదవి కోల్పోయే పరిస్థితికి దారితీసింది. ఈ నేపథ్య ంలో, 1995లో ఎంపీపీగా మొదలైన ఆమె రాజకీయ ప్రస్థానంలోని ప్రధాన మలు పులు, వివాదాలు మరోసారి చర్చనీయాం శమయ్యాయి. వైఎస్ విధేయురాలిగా. జగన్ సైనికురాలిగా..కొండా మురళి తొలుత పీపుల్స్ వార్ గ్రూపులో పనిచేసి, ఆ తర్వాత రాజకీ యాల్లోకి వచ్చారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన కొండా దంపతులు, దివంగత ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికి అత్యంత సన్నిహితులుగా, ముఖ్య అనుచరులుగా పేరు తెచ్చుకున్నారు. ఆ విధేయతకు గుర్తింపుగా 2009లో వైఎస్ఆర్ ప్రభుత్వంలో కొండా సురేఖకు మంత్రి పదవి లభించింది. వైఎస్ఆర్ ఆకస్మిక మరణం తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. వైఎస్ జగన్ కాంగ్రెస్ అధిష్ఠానంతో విభేదించినప్పుడు, రోశయ్య కేబినెట్‌లో మంత్రిగా ఉన్న సురేఖ, జగన్‌కు మద్దతుగా తన పదవికి రాజీనామా చేసి సంచలనం సృష్టించారు. అంతేకాకుండా, ఎమ్మెల్యే పదవిని కూడా త్యజించి ఉప ఎన్నికలకు వెళ్ళి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆమె, జగన్ ఓదార్పు యాత్ర సందర్భ ంగా మహబూ బాబాద్ (మానుకోట)లో తెలంగాణ ఉద్యమకా రుల నుంచి తీవ్ర వ్యతిరేకతను, నిరసనలను ఎదుర్కొ న్నారు.పార్టీలు మారినా వీడని వివాదాలుతెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొండా దంపతులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కానీ అక్కడ ఇమడలేక, ఆ పార్టీ నాయకత్వంపై విమర్శలు చేసి బయటకు వచ్చారు. 2018 ఎన్నికల సమయంలో తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో కొండా కుటుంబం నిత్యం వివాదాలతో వార్తల్లో నిలిచింది. మంత్రిగా ఉన్నప్పటికీ, సహచర ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి వంటి నేతలతో ఆధిపత్య పోరు నడిపారు. ఈ గొడవలు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదుల వరకు వెళ్లాయి. గతంలో సినీ నటుడు నాగార్జున కుటుంబాన్ని ఉద్దేశించి ఆమె చేసిన వ్యాఖ్యలు కోర్టు కేసుల వరకు దారితీశాయి. జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితోనూ ఆమెకు సఖ్యత లేదనే ప్రచారం జరిగింది.ఒత్తిడి వ్యూహం బెడిసికొట్టి ందా?తన భర్త కొండా మురళికి ఎమ్మెల్సీ, కుమార్తె సుస్మితకు పరకాల అసెంబ్లీ సీటు కోసం కొండా సురేఖ తీవ్రంగా ఒత్తిడి చేసినట్టు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ నడిచింది. ఈ క్రమం లోనే ఆమె కుమార్తె సుస్మిత నేరుగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం వివాదాన్ని మరింత పెద్దది చేసింది. కుమార్తె వ్యాఖ్యలను ఖండించకపోవ డం, పార్టీకి నిరంతరం తలనొప్పిగా మారు తున్న కొండా కుటుంబంపై చర్యలు తీసుకోవ డానికి అధిష్ఠానానికి ఒక అవకాశంగా మారిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నా రు. చివరకు సురేఖ ప్రయోగించిన బీసీ కార్డు కూడా ఆమె పదవిని కాపాడలేకపోయింది. మొత్తం మీద, ఒత్తిడి రాజకీయాలు, వివాదా స్పద వైఖరే ఆమె మంత్రి పదవిని దూరం చేశాయన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది.

## కాప్రాలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్‌పీకి కొత్త సారథులు
## పరమేష్ మాదిగ, కొత్త నరేష్ మాదిగలకు మండల అధ్యక్ష బాధ్యతలు



అదాబ్ సైబరాబాద్, జవహర్‌నగర్: కాప్రా మండలంలో ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్ట్ పార్టీకి నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. జవహర్‌నగర్ చంద్రపురి కాలనీలోని పానుగంటి బాలయ్య కమిటీ హాల్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మార్పీఎస్ కాప్రా మండల అధ్యక్షుడిగా పరమేష్ మాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ మండల అధ్యక్షుడిగా కొత్త నరేష్ మాదిగను నియమించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాప్రా మండలంలో సంఘటితంగా పనిచేస్తూ సామాజిక న్యాయం, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాటాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కేశపాక రామచందర్ మాదిగ పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగం కు ఆశించకుండా స్వయం ఉపాధిని ఎంచుకోవాలి
## జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పార్లమెంటు సభ్యులు ఆర్ కృష్ణయ్య



ఆదాబ్ సైబరాబాద్, మోమిన్ పేట : నేటి ఆధునిక సమాజంలో యువత ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురు చూసి మోసపోకుండా స్వయం ఉపాధిని ఎంచుకొని తనకాళ్ల పైన తాను నిలబడాల్సిన అవసరం ఎంతైనా ఉందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పార్లమెంటు సభ్యులు ఆర్.కృష్ణయ్య అన్నారు. బుధవారం మోమినిపేట మండల కేంద్రంలోని ఏజీ ఇన్ఫ్రా స్ట్రక్చర్ కార్యాలయంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి ఎంచుకొని కనకాల నిలబడేందుకు ఇలాంటి రంగాన్ని ఎంచుకున్న యజమాని సాయి అరవింద్ గౌడ్ ను ఆయన అభినందించారు. మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న వసతి గృహాన్ని గ్రామపంచాయతీ కార్యాలయమునకు వాడుకునేందుకు ఇవ్వాలని, సర్పంచ్, సంధ్యా సుభాష్ గౌడ్, ఆర్ కృష్ణయ్య దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందించి జిల్లా సాంఘిక సంక్షేమ అధికారికి ఫోన్ లోమాట్లాడి వాడుకునేందుకు అనుమతి ఇస్తామన్నారు. అందుకు సర్పంచ్ సంతోషించి మోమిన్ పేటకు అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సాయి అరవింద్ గౌడ్, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు డబ్బుని వెంకట్, వెంకట్ రెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీకి కాసుల పంట.రాఖీ రద్దీతో వరంగల్ రీజియన్‌కు రూ.17.10 కోట్ల ఆదాయం




హనుమకొండ: రాఖీ పండుగ వరంగల్ రీజియన్ ఆర్టీసీకి కాసుల వర్షం కురిపించింది. పండుగ సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల రద్దీ పెరగడంతో ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను పెద్ద సంఖ్యలో నడిపింది. ఆగస్టు 26 నుంచి 31 వరకు ఆరు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక రవాణా ద్వారా వరంగల్ రీజియన్ పరిధిలోని 9 డిపోలను కలిపి రూ.17కోట్ల 10లక్షల 61వేయి 98 ఆదాయాన్ని ఆర్జించాయి. ఆరు రోజుల్లో మొత్తం బస్సులు 24,99,032 కిలోమీటర్లు తిరిగినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. రాఖీ పండుగకు ముందు నుంచే ప్రయాణికుల రద్దీని అంచనా వేసిన అధికారులు అం దుకు అనుగుణంగా బస్సులను అందుబాటులో ఉంచడంతో ఆదా యం గణనీయంగా పెరిగినట్లు తెలిపారు. వరంగల్-2 డిపోకు అగ్రస్థానం..రాఖీరద్దీని సొమ్ము చేసుకోవడంలో వరంగల్-2 డిపో ముందంజలో నిలిచింది. ఆరు రోజుల వ్యవధిలో వరంగల్-2 డిపో బస్సులు 3లక్షల 84వేల 841 కిలోమీటర్లు ప్రయాణించి రూ.2కోట్ల 58లక్షల 56వేల 976 ఆదాయాన్ని సాధించాయి. మొత్తం రీజియన్ ఆదాయంలో అత్యధిక వాటాను ఈ డిపోనే నమోదుచేసింది. వరంగల్-1 డిపోలో బస్సులు 4లక్షల 10వేల 088 కిలోమీటర్లు ప్రయాణించగా రూ.2కోట్ల 38లక్షల 20వేల 190 ఆదాయం సమకూరినట్లు తెలిపారు. హనుమ కొండ డిపో 3లక్షల 39వేల 012 కిలోమీటర్ల మేరకు బస్సులు ప్రయాణించగా రూ.2 కోట్ల 29లక్షల 24వేల 173 ఆదాయం సమకూర్చి ంది. తొర్రూరు డిపోలోని బస్సులు 2లక్షల 63వేల 423 కిలోమీటర్లు ప్రయాణించగా రూ.2కోట్ల 4ల క్షల 3వేల547 ఆదాయం సమ కూరింది. జన గామ డిపోలోని బస్సులు 2లక్షల 89వేల 757 కిలోమీటర్లకు గాను రూ.2కోట్ల 1లక్ష 81వేయి 709 ఆదాయం, భూపాలపల్లి డిపోకు చెందిన బస్సులు 2లక్షల 43వేల756 కిలోమీటర్లకు గాను రూ.1కోటి 79లక్షల 16వేల 857 ఆదాయం,నర్సంపేట డిపోకు చెందిన బస్సులు 2లక్షల 13వేల 106 కిలోమీ టర్లు ప్రయాణించగా రూ.1కోటి 50లక్షల 12వేల 390 ఆదాయం, పరకాల డిపోకు చెందిన బస్సులు 1లక్షా 85వేల 244 కిలోమీటర్లకు గాను రూ.1కోటి 32లక్షల 71వేయి 529 ఆదాయం, మహబూబాబాద్ డిపోకు చెందిన బస్సులు 1లక్షా 69వేల 785 కిలోమీటర్లకు గాను రూ.1కోటి 16లక్షల 73వేల 727 ఆదాయం సమకూరినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.ప్రణాళికతో పెరిగిన ఆదాయం.పండుగ సమయంలో అవసరాలకు అనుగుణంగా బస్సు సర్వీసులను నడిపితే సంస్థకు ఆదాయం పెరగడంతోపాటు మెరుగైన రవాణా సౌకర్యం కలిగిందని ప్రయాణికులు సంతృప్తి వ్యక్తం చేశారు. అవసరమైన రూట్లలో సర్వీసులను పెంచడం, డిపోల స్థాయిలో సమన్వయంతో పనిచేయడం వల్లే ఈస్థాయిలో ఆదాయం సాధ్యమైందని వరంగల్ రీజినల్ మేనేజర్ భవానిప్రసాద్ పేర్కొన్నారు. రాబోయే పండుగలు, సెలవుల సమయంలోనూ ఇదేత రహాలో ముందస్తు ప్రణాళికతో సర్వీసులు నిర్వ హించేందుకు అధికారులు, ఆర్టీసీ సిబ్బంది సమ న్వయంతో ముందుకెళ్తామని ఆర్ఎం తెలిపారు.

## నీటి పంపకాల్లో కుదరని ఏకాభిప్రాయం
## మరోసారి వాయిదా పడ్డ కృష్ణాబోర్డు సమావేశం




హైదరాబాద్ :కృష్ణాబోర్డు పరిధిలో నీటి పంపకాల విషయంలో శుక్రవారం జరిగిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఈఎన్సీల సమావేశం మరోసారి వాయిదా పడింది. ఈ సమావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోకుండానే సెప్టెంబర్ నాలుగో వారంలో మరోసారి కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ పూర్తి స్థాయి నిర్వహించి నీటి వాటాల విషయంలో నిర్ణయం తీసుకోనుంది.50 శాతం వాటా అడిగాం : తెలంగాణ ఈఎన్సీ రమేశ్ బాబుఈ సందర్భంగా తెలంగాణ తరుపున పాల్గొన్న ఈఎన్సీ సభ్యుడు రమేష్ బాబు ( మాట్లాడుతూ తాగునీటిపై త్రిసభ్య కమిటీ సమావేశంలో చర్చ జరిగిందని వివరించారు. ఎల్ నినో ఉన్నందున తాగునీటి కోసం చేరో 50శాతం వాటా తీసుకోవాలని తెలంగాణ కోరగా ఏపీ పాత పద్ధతిన 66:34 వాటా లెక్కన పంపిణి చేయాలని డిమాండ్ చేసిందని వెల్లడించారు. 66:34 నిష్పత్తి డిమాండ్ ను మూడేళ్లుగా తాము అంగీకరించడం లేదని తెలిపారు.ఇప్పటికే పోతిరెడ్డిపాడు నుంచి ఏపీ నిబంధనలకు విరుద్ధంగా నీళ్లను తీసుకపోతోందని, ఇప్పుడు వెలిగొండ నుంచి కూడా నీరు తీసుకుంటున్నారని వివరించారు. మొత్తం తెలంగాణ 200 టీఎంసీలు, ఏపీ 100 టీఎంసీలను అడిగిందని అన్నారు.సెప్టెంబర్ నాలుగో వారంలో జరిగే బోర్డు సమావేశంలో పూర్తి స్థాయిలో చర్చిస్తామని పేర్కొన్నారు.తెలంగాలో అవసరం లేకున్నా శ్రీశైలం వద విద్యుత్ ఉత్పత్తి : ఏపీ ఈఎన్సీ నరసింహమూర్తిఏపీ ఈఎన్సీ సభ్యుడు నరసింహమూర్తి మాట్లాడుతూ త్రిసభ్య కమిటీ సమావేశంలో ఏకాభిప్రాయం కుదరలేదన్నారు. 66:34 నిష్పత్తిలో ఏపీ, తెలంగాణకు నీటి విడుదల ఉత్తర్వులు ఇవ్వాలని కోరామని తెలిపారు. ఎల్ నినో ఉన్నందున తాగునీటి కోసం 50:50 నిష్పత్తిలో ఇవ్వాలని తెలంగాణ కోరిందని, వచ్చే ఆగస్టు వరకు 104 టీఎంసీలు కావాలని కోరామని వివరించారు. తెలంగాణ 200 టీఎంసీలు కావాలని కోరిందని, ఆ ప్రతిపాదన సహేతుకం కాదని చెప్పామని వెల్లడించారు.తెలంగాణ అవసరం లేకున్నా శ్రీశైలం వద్ద విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని సమావేశంలో ఆరోపించామన్నారు.

# కూకట్‌పల్లి జేఎన్టీయూలో ఘర్షణ.. 8 మంది విద్యార్థుల అరెస్ట్: డీసీపీ




హైదరాబాద్: కూకట్‌పల్లిలోని జేఎన్టీయూలో విద్యార్థుల మధ్య ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గురువారం రాత్రి నిర్వహించిన తీజ్ వేడుకల్లో ఓ విద్యార్థిపై పలువురు దాడి చేశారు. అనంతరం గౌతమి, మంజీరా హాస్టళ్లలో విద్యార్థులు పరస్పరం దాడులకు దిగడంతో జేఎన్టీయూ ప్రాంగణం రణరంగంగా మారింది.ఈ ఘటనలో పలువురు విద్యార్థులు గాయపడగా, వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న కేపీహెచ్?బీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఘర్షణకు దారి తీసిన కారణాలు, ఘటనలో పాల్గొన్న విద్యార్థుల వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. స్టూడెంట్ యూనియన్ల పేరుతో కొంతమంది రౌడీయిజం చేస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు."కొందరు వ్యక్తులు మద్యం సేవించి జేఎన్?టీయూ మెయిన్?గేట్? సెక్యూరిటీ గార్డులతో కర్రలు లాక్కొని దుర్గాప్రసాద్ అనే విద్యార్థిని తీవ్రంగా గాయపరిచారు. ఈ విషయం గురించి సంబంధిత అధ్యాపకులకు ఫోన్? చేసి చెప్పాం. కానీ వారు నిర్లక్ష్యంగా కాల్?కట్? చేశారు. దాదాపు 15 మంది దాకా ఉన్న ఓ గ్రూప్? గదుల్లో ఉండే స్టూడెంట్స్?ను బయటకు లాక్కొచ్చి మరీ విచక్షణా రహితంగా దాడి చేసింది. ఈ గ్రూప్?లో ఉన్నవారు స్టూడెంట్స్ ఆర్గనైజేషన్? పేరుతో రౌడీయిజం, గుండాయిజం చేస్తున్నారు. వీరిపై జేఎన్?టీయూ మేనేజ్?మెంట్? వెంటనే చర్యలు తీసుకోవాలి" - జేఎన్?టీయూ విద్యార్థులు"కూకట్ పల్లి జేఎన్టీయూలో గత రాత్రి తీజ్ వేడుకల్లో విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. గౌతమి, మంజీరా హాస్టల్స్ ఉ ండే విద్యార్థులు కర్రలతో ఒకరిపై ఒకరు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఇరువర్గాల విద్యార్థుల నుంచి ఫిర్యాదులు అందాయి. ఎనిమిది మంది విద్యార్థులను అదుపులోకి తీసుకున్నాం. ఘటనపై కేసులు నమోదు చేసి, సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నాం. ఘర్షణకు గల కారణాలు, బాధ్యులపై ఆరా తీస్తున్నాం. ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకుంటున్న సమయంలో గొడవ పెరిగి గ్రూపు తగాదాగా మారినట్లు తెలుస్తోంది. జేఎన్టీయూ ప్రిన్సిపల్, వార్డెన్స్?తో మాట్లాడతాం. మద్యం మత్తులో ఉన్న ఓ విద్యార్థి బయట తాగి వచ్చాడా? లోపల తాగాడా అని విచారిస్తున్నాం" - రితిరాజ్, కూకట్?పల్లి డీసీపీ

## రాజరాజేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



ఆదాబ్ సైబరాబాద్ , ఆల్విన్ కాలనీ: డివిజన్ పరిధిలోని భూదేవి హిల్స్, ఆల్విన్ కాలనీలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో దివ్య విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో శ్రీ మహాగణపతి, శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ప్రతిష్ఠా మహోత్సవంలో భక్తులు, కాలనీ వాసులు, పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కమిటీ సభ్యులు కోరారు..

## సర్టిఫికెట్లు లేకున్నా అప్లై చేసుకోవచ్చు.. తెలంగాణలో కొత్త పింఛన్ దరఖాస్తుదారులకు ఉపశమనం




హైదరాబాద్:కొత్త పింఛన్ కోసం ఎదురుచూస్తున్న అర్హులకు తెలంగాణ ప్రభుత్వం ఊరటనిచ్చింది. దరఖాస్తు సమయంలో ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో లేకపోయినా.. వాటి కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ముందుగా కొత్త పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం, సెర్ప్ వెల్లడించింది. దీంతో సర్టిఫికెట్లు రావడంలో జాప్యం కారణంగా దరఖాస్తు గడువు మిస్ అవుతుందేమోనని ఆందోళన చెందుతున్న వారికి ఉపశమనం లభించింది.ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. అయితే దివ్యాంగుల సర్టిఫికెట్లు, కులం, ఆదాయం, మరణ ధ్రువీకరణ పత్రాలు పొందడంలో ఆలస్యం జరుగుతున్నట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. రెవెన్యూ, తహసీల్దార్ కార్యాలయాలు, సదరం క్యాంపుల నుంచి సర్టిఫికెట్లు పొందేందుకు సమయం పడుతుండటంతో అర్హులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో సర్టిఫికెట్ల కోసం ఆగకుండా ముందుగా ఆన్‌లైన్‌లో లేదా నిర్దేశిత మీసేవా కేంద్రాల్లో కొత్త పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని సెర్ప్ స్పష్టం చేసింది. అయితే ఇక్కడే ఓ కీలక నిబంధన ఉంది.వెరిఫికేషన్‌లో మాత్రం తప్పనిసరిదరఖాస్తు చేసే సమయంలో ధ్రువీకరణ పత్రాలు లేకపోయినా ఫర్వాలేదు. కానీ అధికారులు దరఖాస్తును పరిశీలించే సమయంలో మాత్రం సంబంధిత సర్టిఫికెట్లను తప్పనిసరిగా సమర్పించాలి. కాబట్టి దరఖాస్తు చేసుకున్న తర్వాత అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సిద్ధం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.సెప్టెంబర్ 15 వరకు అవకాశం కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సెప్టెంబర్ 15 చివరి తేదీగా అధికారులు ప్రకటించారు. అర్హత ఉన్న వారు ఇంకా దరఖాస్తు చేయకపోతే ఎలాంటి ఆలస్యం చేయకుండా గడువులోపు అప్లై చేసుకోవాలని సూచించారు. గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులను పరిగణనలోకి తీసుకునే అవకాశం ని స్పష్టం చేశారు. దీంతో అర్హులైన పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

శనివారం,
సెప్టెంబర్ 05, 2026
TGTEL/26/A4985
ఆదాబ్ సైబరాబాద్
ADAAB CYBERABAD





# డెంగ్యూ పంజా..!

## కాటాపురంలో డెంగ్యూ.. మలేరియా కలకలం..!

## ములుగు డీఎంహెచ్‌వో గారు స్పందించరా..?

- కాటాపురం ఆసుపత్రిలో డాక్టర్ కరువు..!
- క్రాస్‌రోడ్‌లో జ్వరాల విజృంభణ..విలవిల్లాడుతున్న ప్రజలు
- వైద్యం కోసం వరంగల్,హనుమకొండకు పరుగులు..
- హెల్త్ క్యాంపులు ఎక్కడ..? ఇంటింటి వైద్యం ఏదీ..?
- వెంటనే అధికారులు స్పందించాలని డిమాండ్






చర్చివాడగడ్డం కుమార్‌కు డెంగ్యు

**ఆదాబ్ సైబరాబాద్, ములుగు జిల్లా :** తాడ్వాయి మండలంలోని కాటాపురం గ్రామాన్ని జ్వరాలు వణికిస్తున్నాయి. ముఖ్యంగా క్రాస్‌రోడ్ ప్రాంతంలో డెంగ్యూ,మలేరియా అనుమానిత జ్వరాలతో పలువురు బాధపడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.దోమల బెడద తీవ్రంగా పెరగడంతో చిన్నారులు, పెద్దలు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.స్థానికంగా సరైన వైద్య సదుపాయాలు అందుబాటులో లేకపోవడంతో కొందరు మెరుగైన వైద్యం కోసం వరంగల్, హనుమకొండలోని ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నట్లు సమాచారం.

### క్రాస్‌రోడ్‌లో జ్వరాల కలకలం..!

క్రాస్‌రోడ్ పరిధిలోని పలు ఇళ్లలో జ్వరాలు రావడంతో స్థానికంగా ఆందోళన నెలకొంది.దోమకాటుతో చర్మంపై దద్దుర్లు,జ్వరంతో బాధపడుతున్న చిన్నారులు,పెద్దలు ఉన్నారని స్థానికులు చెబుతున్నారు. దాదాపు పది ఇళ్లలో జ్వరాల సమస్య కనిపిస్తోందని,కొందరి పరిస్థితి ఎక్కువ కాలం జ్వరం తగ్గకపోవడంతో పట్టణ ప్రాంతాల్లోని ఆసుపత్రులకు తీసుకెళు _న్నామని బాధిత కుటుంబాలు పేర్కొంటున్నాయి. జ్వరాల తీవ్రత పెరుగుతున్నప్పటికీ గ్రామంలో వైద్యపరమైన ముందస్తు చర్యలు కనిపించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

### ఆసుపత్రిలో డాక్టర్ లేరు..వైద్యంలేదు..!

కాటాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.సిబ్బంది ఉన్నప్పటికీ పూర్తిస్థాయి వైద్య సేవలు అందడం లేదని స్థానికులు అంటున్నారు. జ్వరాలు విజృంభిస్తున్న సమయంలో గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు పరీక్షలు చేయాల్సి ఉండగా,అలాంటి చర్యలు కనిపించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### హెల్త్ క్యాంపులు ఎక్కడ..?

డెంగ్యూ,మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, అనుమానిత కేసులను గుర్తించి పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.అయితే కాటాపురంలో ఇప్పటివరకు ప్రత్యేక హెల్త్ క్యాంపులు నిర్వహించిన దాఖలాలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.




పెరకవాడ పెద్దమనిషికి డెంగ్యుతో ఆసుపత్రిలో

ఇంటింటికీ వెళ్లి జ్వరపీడితులను గుర్తించి పరీక్షలు నిర్వహించడం, దోమల నివారణ చర్యలు చేపట్టడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే చర్యలు చేపట్టడంలో అధికారులు వేగం పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

### డీఎంహెచ్‌వో గారు పట్టించుకోరా..?

కాటాపురంలో జ్వరాల పరిస్థితిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.పరిస్థితిని పరిశీలించేందుకు ఉన్నతాధికారులు గ్రామాన్ని సందర్శించి,అవసరమైన వైద్య బృందాలను పంపించాలని డిమాండ్ చేస్తున్నారు.కనీసం డిప్యూటీ డీఎంహెచ్‌వో స్థాయి అధికారులు కూడా గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు విమర్శిస్తున్నారు.

### దోమల బెడదపై చర్యలేవీ..?

గ్రామంలో దోమల ప్రభావం పెరుగుతున్నప్పటికీ దోమల నివారణకు అవసరమైన పారిశుద్ధ్య చర్యలు,ఫాగింగ్,నిల్వ నీటి ప్రాంతాల గుర్తింపు వంటి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.జ్వరాలు మరింత విస్తరించకుండా తక్షణమే వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తం కావాలని అంటున్నారు.

### ఇప్పటికైనా స్పందించాలి...!

కాటాపురంలో జ్వరాలపై అధికారులు వెంటనే ప్రత్యేక వైద్య బృందాలను పంపించి,ఇంటింటి సర్వే నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.అనుమానిత డెంగ్యూ, మలేరియా కేసులకు పరీక్షలు నిర్వహించి,అవసరమైన వైద్యం అందించాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రామంలో జ్వరాలు మరింత విస్తరించకముందే వైద్య ఆరోగ్యశాఖ స్పందించి సమగ్ర నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులు ఇంకా నిర్లక్ష్యం చేస్తే పరిస్థితి మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఆసుపత్రిని గాలికొదిలిన అధికారులు

EDITOR PRINTER AND PUBLISHER OWNED BY BILLALPURSARA SHIVA KUMAR, PRINTING AT RIYAZ PRINTING PRESS, S NO 22-8-161, BEHIND NAYAAB HOTEL, CHATTA BAZAR, HYDERABAD, TELANGANA - 500002 AND PUBLISHED FROM H.NO: 2-1-602, TARAKARAMA NAGAR, YELLAMMABANDA, KUKATPALLY, MEDCHEL- MALKAJGIRI DIST, TELANGANA-500 072. PRGI: TGTEL/26/A4985. PHONE NO: +91 8686861338, +91 81215 50907 EMAIL : shivakumarlal@gmail.com

# నౌకాదళంలోకి మరో స్వదేశీ అస్త్రం- ఏకంగా 300 మీటర్ల లోతులో సైతం ఆపరేషన్లు

**న్యూఢిల్లీ:** భారత నౌకాదళ అమ్ములపొదిలోకి మరో అత్యాధునిక స్వదేశీ అస్త్రం వచ్చి చేరింది. డీప్‌సీ డైవింగ్ సపోర్ట్ వెస్సెల్ ఐఎన్ఎస్ నిపుణ్ ఇండియన్ నేవీలో జలప్రవేశం చేసింది. విశాఖలోని హిందుస్థాన్ షిప్‌యార్డ్ సంస్థ ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో దీన్ని నిర్మించింది. సముద్ర జలాల్లో సరికొత్త సవాళ్లు ఎదురవుతున్న ప్రస్తుత తరుణంలో ఏకంగా 300 మీటర్ల లోతులో సైతం ఆపరేషన్లు చేయగల నిపుణ్ రాకతో ఇండియన్ నేవీ సామర్థ్యం మరింత పటిష్టమైంది. డీప్‌సీ డైవింగ్ సపోర్ట్ వెస్సెల్-ఞూఎ ఐఎన్ఎస్ నిపుణ్ ముంబయి నావల్ డాక్‌యార్డులో అధికారికంగా ఇండియన్ నేవీలో కమిషన్ అయింది. నౌకాదళ చీఫ్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ సమక్షంలో ఈ నౌక జల ప్రవేశం చేసింది. భారత నౌకాదళంలో చేరిన ఈ తరహా రెండో డీప్-సీ డైవింగ్ వెస్సెల్ ఇదే కావడం విశేషం. విశాఖపట్నంలోని హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ స్వదేశీ ఈ నౌకను నిర్మించింది. 120 మీటర్ల పొడవుతో ఉన్న నిపుణ్ 10,500 టన్నుల బరువు మోసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. సముద్రగర్భంలో 300 మీటర్ల లోతువరకు డైవింగ్ ఆపరేషన్లకు ఇది నిరంతర మద్దతు ఇవ్వగలదు. నిపుణ్ కమిషనింగ్‌లో పాల్గొన్న సందర్భంగా భారత నౌకాదళ చీఫ్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ కీలక వ్యాఖ్యలు చేశారు. సముద్ర గర్భంలో నిపుణ్ 300 మీటర్ల లోతు వరకు డైవింగ్ ఆపరేషన్లకు నిరంతర మద్దతు ఇవ్వగలదని ఆయన వివరించారు. సముద్రజలాల్లో ఎదురయ్యే ముప్పు స్వభావం నిరంతరం మారుతోందని, సరికొత్త రూపాల్లో క్లిష్టమైన సవాళ్లు వచ్చిపడుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో సంక్షోభాలను ఎదుర్కోవడంలో స్వదేశీ నౌకల చేరిక ఎంతో కీలకమని నేవీ చీఫ్ పేర్కొన్నారు. ఐఎన్ఎస్ నిపుణ్‌లో సముద్రపు అడుగుభాగంలో పనిచేసే డైవర్ల కోసం అత్యాధునిక డైవింగ్ సిస్టమ్స్, నావిగేషన్, ప్లాట్‌ఫామ్ మేనేజ్‌మెంట్ వ్యవస్థలతోపాటు వైద్య సహాయ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. ప్రమాదంలో చిక్కుకున్న జలాంతర్గాములను అత్యంత వేగంగా కాపాడే రాపిడ్ రెస్క్యూ సామర్థ్యం దీని సొంతం. విపత్తు సహాయక చర్యల్లోనూ ఇది కీలక పాత్ర పోషిస్తుంది.

నిపుణ్ రాకతో హిందూ మహాసముద్ర ప్రాంతం-Xూ=లో భారత నేవీ ఆపరేషనల్ సామర్థ్యం మరింత పటిష్టమైంది.




# 28 ఏండ్ల నాటి కశ్మీరీ పండిట్ల ఊచకోత కేసుపై విచారణ పునఃప్రారంభం

**కశ్మీర్** లోయలో ఉగ్రవాదం తీవ్రంగా ఉన్నప్పుడు జరిగిన చారిత్రక నేరాలకు సంబంధించిన కేసులు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని తిరిగి విచారణ చేసేందుకు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా కశ్మీరీ పండిట్ల ఊచకోత కేసుపై కూడా దృష్టిపెట్టింది స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ . ఈ కేసుకు సంబంధించిన సాక్ష్యాలను పరిశీలించి అనుమానితులను విచారిస్తూ ఆధారాలను సేకరిస్తుంది ఎస్ఐఏ. అంతేకాదు ఇతర ప్రముఖ హత్య కేసులపై కూడా తిరిగి విచారణ చేపడుతుంది ఎస్ఐఏ. ఈ కేసుల విచారణ నిమిత్తం ఎస్ఐఏ బృందం ఇటీవల పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి సోదాలు చేపట్టింది. 23 మంది పండిట్ల ఊచకోత1998, జనవరి 25న గందర్బల్ జిల్లాలోని వంధామా గ్రామంలో కశ్మీరీ పండిట్ కుటుంబాల ఇళ్లలోకి ఉగ్రవాదులు ఆయుధాలతో చొరబడ్డారు. తొమ్మిది మంది మహిళలు, నలుగు పిల్లలతో సహా మొత్తం 23 మందిని కాల్చి చంపారు. ఈ ఘటన రంజాన్ నెలలోని పవిత్ర రోజుల్లో ఒకటైన షబ్ ఎ ఖద్ర్ రాత్రి, గణతంత్ర దినోత్సవానికి ఒకరోజుముందు జరిగింది. ఈ కేసు సుమారు మూడు దశాబ్దాలుగా పెండింగ్‌లోనే ఉంది. అదేవిధంగా ఉగ్రవాదులు 1989, సెప్టెంబర్‌లో అప్పటి జమ్మూ కశ్మీర్ బీజేపీ ఉపాధ్యక్షుడు అయిన కశ్మీరీ పండిట్ టీకా లాల్ టప్లూను కాల్చిచంపారు. జమ్మూ కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ (జీఖూఖీ) ఉగ్రవాది మక్బూల్ భట్‌కు మరణశిక్ష విధించిన జస్టిస్ నీలకంఠ గంజూను 1989, నవంబర్ 4న హత్య చేశారు. వీటితో పాటు1990లో జరిగిన నర్సు సరళా భట్, రచయిత సర్వానంద్ కౌల్ ప్రేమి, అతని కుమారుడు వీరేందర్ కౌల్‌ల హత్య కేసులపై కూడా ఎస్ఐఏ దర్యాప్తు చేపట్టింది. ఈ కేసులకు సంబంధించి బతికి ఉన్న అనుమానితులు, ఉగ్రవాదులకు సహాయం చేసినవారిని గుర్తించడంలో సహాయపడే ఆధారాలను సేకరిస్తుంది.



# మణిపూర్‌లో కాల్పులు.. పారామిలిటరీ జవాన్‌కు గాయం, పలు ఇళ్లకు నిప్పు

**ఇంఫాల్:** మణిపూర్‌లో ఉద్రిక్తతలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. దుండగులు పలు ఇళ్లకు నిప్పుపెట్టారు. భద్రతా సిబ్బంది అక్కడకు చేరుకోగా కాల్పులు జరిగాయి. ఈ సంఘటనలో ఒక జవాన్ కాలుకు గాయమైంది. కాంగ్‌పోక్పి జిల్లాలోని సేనాపతి, పరిసర ప్రాంతాల్లో ఈ సంఘటనలు జరిగాయి. సోమవారం తెల్లవారుజామున 2.40 గంటల సమయంలో నాగా తెగలకు చెందినవారి ఇళ్లను దుండగులు లక్ష్యంగా చేసుకున్నారు. తఫౌ కుకి, ఫూబా గ్రామాల్లో నాగా నివాసితుల ఇళ్లకు నిప్పు పెట్టారు. లై గ్రామానికి చెందిన నాగా నివాసి ఇంటిని కూల్చివేశారు. 9ఎంఆర్, మారెయిమెయి పరిసరాల్లో కూడా నాగా తెగలకు చెందిన ఇళ్లపై దాడులు జరిగాయి. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న ఫైర్ సిబ్బందితో పాటు పారామిలిటరీ దళాలు ఆయా ప్రాంతాలకు చేరుకున్నాయి. అయితే లియాంగ్‌మై తఫౌ వద్ద ఊహించని విధంగా కాల్పులు జరిగాయి. 36 సీఆర్‌పీఎఫ్‌కు చెందిన జవాన్ కాలికి బుల్లెట్ గాయమైంది. సేనాపతిలోని జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇరువైపుల నుంచి కాల్పులు జరిగినట్లు కనిపించిందని, అయితే బుల్లెట్ ఏ దిశ నుంచి వచ్చిందో తాను గుర్తించలేకపోయానని గాయపడిన ఆ జవాన్ తెలిపారు. మరోవైపు తమ ఇళ్లను లక్ష్యంగా చేసుకోవడంపై నాగా తెగల ప్రజలు ఆగ్రహం చెందారు. ఇంఫాల్ -- దిమాపూర్ హైవేను దిగ్బంధించారు. దీంతో మణిపూర్, నాగాలాండ్ మధ్య ఉన్న నేషనల్ హైవే 2 మార్గంలో రాకపోకలకు అంతరాయం కలిగింది.



# నేపాల్ వరద బాధితులకు అండగా కేంద్రం

**నేపాల్:** నేపాల్‌ను అతలాకుతలం చేసిన ఆకస్మిక వరద ఊళ్లకు ఊళ్లను ఊడ్చేసింది. ఈ పెను విపత్తులో భారతీయులు కూడా మరణించారు. ఈ క్రమంలో తమ ఆత్మీయుల జాడ తెలియక దేశంలోని అనేక కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి. బురద, శిథిలాల నుంచి వెలికితీస్తున్న మృతదేహాలను గుర్తించడం నేపాల్ అధికారులకు పెద్ద సవాల్‌గా మారిన తరుణంలో కీలక నిర్ణయం తీసుకుంది. గల్లంతు అయిన వారి ఆచూకీ కోసం, దొరికిన మృతదేహాల గుర్తిం పు కోసం సాయం చేయాలని కేంద్ర విదేశాంగ శాఖ నిర్ణయించింది. వరదల్లో చనిపోయిన వారి మృతదేహాలను గుర్తించేందుకు డీఎన్ఏ పరీక్షలు కీలకంగా మారాయి. దేశంలోని కేంద్ర, రాష్ట్ర స్థాయి ఫోరెన్సిక్ ల్యాబ్‌ల ద్వారా డీఎన్ఏ ప్రొఫైలింగ్ సేవలను ఉచితంగా అందుబాటులోకి తెస్తున్నట్లు ఎంఈఏ పేర్కొంది. నేపాల్‌లో గల్లంతైన వారి బంధువులు అంటే తండ్రి, తల్లి, కుమారుడు, కుమార్తె లేదా తోబుట్టువులు ప్రస్తుతం భారత్?లో నివసిస్తుంటే, వారు ఈ సేవలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపింది. సమీప బంధువుల నుంచి డీఎన్?ఏ నమూనాలను సేకరించి, వాటి ఆధారంగా డీఎన్ఏ ప్రొఫైల్‌ను సిద్ధం చేయాలని వెల్లడించింది. అలా నేపాల్లో గుర్తుతెలియని మృతదేహాలను డీఎన్ఏతో పోల్చడం ద్వారా వారి గుర్తింపు నిర్ధారించే అవకాశం ఉంటుందని స్పష్టం చేసింది. ఫోరెన్సిక్ ల్యాబ్‌ల సేవలుఈ డీఎన్ఏ ప్రొఫైలింగ్ కోసం దేశంలోని వివిధ ఫోరెన్సిక్ సంస్థల సేవలను కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీస్ (సీఎఫ్?ఎస్?ఎల్?), స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీస్ (ఎస్?ఎఫ్?ఎస్?ఎల్?), నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ ప్రయోగశాలల్లో ఈ సేవలు పొందవచ్చని విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అలాగే డీఎన్ఏ ప్రొఫైలింగ్ సామర్థ్యం కలిగిన ఎన్?ఏబీఎల్? గుర్తింపు పొందిన ప్రయోగశాలల్లోనూ ఈ పరీక్షలు నిర్వహించవచ్చని తెలిపింది. వరదల్లో గల్లంతైన తమ కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం ఎదురుచూస్తున్న వారికి ఈ సదపాయం ఎంతో ఉపయోగపడనుంది. ఆటోసోమల్ ఎస్‌టీఆర్ డీఎన్ఏ ప్రొఫైలింగ్నేపాల్ పోలీసుల సూచనల మేరకు, అక్కడ అమలులో ఉన్న నిబంధనలకు అనుగుణంగా 'ఆటోసోమల్ ఎస్‌టీఆర్ డీఎన్ఏ ప్రొఫైలింగ్' విధానాన్ని ఇక్కడ అనుసరిస్తున్నారు. దీని ద్వారా తీసిన ప్రొఫైల్స్ అత్యంత కచ్చితమైన ఫలితాలను ఇస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఈ మొత్తం ప్రక్రియను సులువు చేయడానికి, ఏవైనా సందేహాలుంటే నివృత్తి చేయడానికి నేపాల్ ప్రభుత్వం ప్రత్యేకంగా ం977 9841 6160 95 హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులో ఉంచింది. భారత్‌లోని ల్యాబ్‌లలో రూపొందించిన డీఎన్ఏ ప్రొఫైల్స్‌ను, నేపాల్ అధికారులు కోరిన విధంగా ఈమెయిల్ ఐడీకి పంపాల్సి ఉంటుంది. అక్కడ లభ్యమైన మృతదేహాల డీఎన్ఏ నమూనాలతో వీటిని సరిపోల్చి చూస్తారు. అలాగే, నేపాల్?లోని భారత రాయబార కార్యాలయం ఈ మొత్తం ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తుంది. డీఎన్ఏ ప్రొఫైల్ కాపీనిఈమెయిల్‌కు కూడా పంపాలని ఎంఈఏ స్పష్టం చేసింది. 1,259కు చేరిన మృతుల సంఖ్యఇదిలా ఉండగా నేపాల్‌లో గత వారం సంభవించిన ఆకస్మిక వరదల కారణంగా మృతుల సంఖ్య భారీగా పెరిగింది. ప్రభావిత ప్రాంతాల నుంచి సహాయక బృందాలు మరిన్ని మృతదేహాలను వెలికితీస్తుండటంతో, మృతుల సంఖ్య కనీసం 1,259కు చేరినట్లు నేపాల్ అధికారులు తెలిపారు. అత్యవసర సహాయక బృందాలు ఇప్పటివరకు 12 వేల మందికిపైగా ప్రజలను రక్షించినట్లు సమాచారం. అయినప్పటికీ గాలింపు, సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. సుమారు 5 వేల మంది ఆచూకీ ఇప్పటికీ తెలియలేదు.



# శాంతిపై భారత్-రష్యాది ఒకటే మాట- ఇప్పుడు బాల్ ఉక్రెయిన్ కోర్టులో ఉంది

**న్యూఢిల్లీ:** ఉక్రెయిన్ వివాదాన్ని పరిష్కరించడానికి శాంతి, చర్చల ఆవశ్యకతపై రష్యా, భారత్ ఒకే అభిప్రా యంతో ఉన్నాయని భారత్?లోని రష్యా రాయ బారి డెనిస్ అలిపోవ్ అన్నారు. రష్యా శాంతికి సిద్ధంగా ఉందని, ఇక నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత ఉక్రెయిన్‌పై ఉందని ఆయన స్పష్టం చేశారు. చర్చలు, దౌత్యం కోసం భారత ప్రధాని నరేంద్ర మోదీ నిరంతరం చేస్తున్న పిలుపు రష్యా వైఖరికి అనుగుణంగానే ఉందన్నారు. ముగింపు పలకడానికి భారత్ చేస్తున్న కృషిని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. "శాంతి కోసం భారత వైఖరి అందరికీ తెలిసిందే. అది స్థిరమైనది. ఆ విషయంలో మేం భారత్‌తో ఏకీభవిస్తున్నాం. దశాబ్దాలుగా రష్యా శాంతి, చర్చలకే కట్టుబడి ఉంది." అని అలిపోవ్ అన్నారు. రష్యా ఇప్పటికే తన శాంతి ప్రతిపాదనలను ముందుకు తెచ్చిందని, రాజీ దిశగా చర్యలు తీసుకుందని అలిపోవ్ వివరించారు. అయితే, ఉక్రెయిన్ సహా దాని యూరోపియన్ మద్దతుదారులు పోరాటాన్ని కొనసాగించాలని చూస్తున్నారని ఆరోపించారు. "మేము ఎల్లప్పుడూ శాంతికి సిద్ధంగా ఉన్నాము. అందుకోసం మేము ప్రతిపాదనలు పంపించాం. కానీ దురదృష్టవశాత్తు ప్రత్యర్థులు ముఖ్యంగా కీవ్, యూరప్‌లోని దాని మద్దతుదారులు పోరాటాన్ని కొనసాగించడానికి సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడు దీనిపై నిర్ణయం ఉక్రెయిన్ పరిధిలో ఉంది (బంతి ఉక్రెయిన్ కోర్టులో ఉంది)" అని ఆయన అన్నారు. నల్ల సముద్రం ప్రాంతంలో దాడులు తీవ్రంగా పెరగడంపైనా అలిపోవ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనల వల్ల భారతీయ నావికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఈ దాడులు సముద్ర భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమించాయని పేర్కొన్నారు. చర్చల ప్రక్రియకు తిరిగి రావాలని ఉక్రెయిన్?పై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. "ఈ ఏడాది నల్ల సముద్రంలో జరిగిన దాడుల సంఖ్య గతంతో పోలిస్తే పది రెట్లు ఎక్కువగా ఉంది. ఉక్రెయిన్ వైపు నుంచే ఈ దాడులు పది రెట్లు పెరిగాయి." అని అలిపోవ్ చెప్పారు. 'అందుకు మోదీ- పుతిన్ మధ్య ఉన్న వ్యక్తిగత సాన్నిహిత్యమే కారణం'భారత్- రష్యా సంబంధాల అభివృద్ధిలో మోదీ- పుతిన్ మధ్య ఉన్న వ్యక్తిగత సాన్నిహిత్యం కూడా ఒక ముఖ్యమైన అంశంగా నిలిచిందని అలిపోవ్ అభిప్రాయపడ్డారు. "వారు తమ వ్యక్తిగత సంబంధాలను చాలా విజయవంతంగా కొనసాగిస్తున్నారు. ఇంకా వారు దీర్ఘకాలిక మిత్రులు. ముఖ్యంగా వారిద్దరు ఒకరినొకరు బాగా అర్థం చేసుకుంటారు. ఒకరి మాటలను మరొకరు శ్రద్ధగా వింటారు." అని అలిపోవ్ అన్నారు. భారత్- రష్యా సంబంధాలకు దిశానిర్దేశం చేయడంలో ఇద్దరు నాయకుల మధ్య క్రమం తప్పకుండా జరిగే సంప్రదింపులు కీలకమని పేర్కొన్నారు. రక్షణ, ఇంధనం, వాణిజ్యం, అంతరిక్ష రంగాలకు సంబంధించిన అనేక ద్వైపాక్షిక ప్రాజెక్టులపై దేశాధినేతలు చర్చించారని ఆయన తెలిపారు. రష్యా ఇంధన ఎగుమతు మినహాయిస్తే ప్రపంచం తట్టుకోలేదు. ఇంధన మార్కెట్లు దానిని భరించలేవు. రష్యా చమురు భారత్?తో పాటు ఇతర దేశాల కోసం అందుబాటులో ఉంటుంది. భారతదేశానికి చమురు సరఫరా చేయడంలో మాకు ఆసక్తి ఉంది. ఆ చమురును కొనడంలో భారతదేశానికి ఆసక్తి ఉంది." అని అలీపోవ్ అన్నారు.



# టీవీకే-కాంగ్రెస్ మధ్య విబేధాలు.. ప్రధానిగా రాహుల్‌కు విజయ్ మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ పట్టు

తమిళనాడులో విజయ్ ఆధ్వర్యంలోని టీవీకే కూటమి అధికారంలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ కూటమిలో కాంగ్రెస్ ప్రధాన భాగస్వామిగా ఉంది. అయితే, ఇప్పుడు ఈ కూటమిలో విబేధాలు చోటు చేసుకున్నాయి. ప్రధాని అభ్యర్థి విషయంలో కాంగ్రెస్, టీవీకే పార్టీల మధ్య వివాదం నడుస్తోంది. 2029లో ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీకి విజయ్ మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. లేదంటే తన మంత్రి పదవికి రాజీనామా చేస్తానని కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రి ఎస్.రాజేశ్ కుమార్ హెచ్చరించారు. తనతోపాటు పి.విశ్వనాథన్ కూడా మంత్రి పదవికి రాజీనామా చేస్తారని ఆయన అన్నారు. దీనికి కారణం ఉంది. 2029లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో విజయ్ ప్రధాని అభ్యర్థిగా ఉంటారంటూ టీవీకే నేతలు తమిళనాడులో ప్రచారం చేస్తున్నారు. విజయ్‌ను ప్రధాని అభ్యర్థిగా ఆ పార్టీ నేతలు బలపరుస్తున్నారు. పైగా ఇటీవల ఒక జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన సర్వేలో విజయ్‌న ప్రధాని అభ్యర్థిగా 9 శాతం మంది అంగీకరిస్తున్నట్లు వెల్లడైంది. దీంతో విజయ్‌కు మద్దతు పెరిగింది. ఇదే కాంగ్రెస్ పార్టీకి ఆగ్రహం తెప్పిస్తోంది. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ అగ్రనేత అయిన రాహుల్ గాంధీకి ఉన్న ఇమేజ్ దృష్ట్యా 2029 ఎన్నికల్లో ఆయనే ప్రధాని అభ్యర్థి అని కాంగ్రెస్ ఎప్పటినుంచో ప్రచారం చేస్తోంది. దేశానికి కాబోయే ప్రధాని రాహులే అంటూ ఎప్పటినుంచో చెబుతోంది. అలాంటిది, తమిళనాడులో టీవీకే విజయ్‌ను ప్రధాని అభ్యర్థిగా చూపెడుతుండటంపై కాంగ్రెస్ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



# 9 రోజులు 'హరేకృష్ణ మంత్రం' జపించిన వరద బాధితుడు.. కృష్ణాష్టమి రోజు గుర్తింపు

**నేపాల్:** వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ వరదల నుంచి తొమ్మిదో రోజైన శుక్రవారం కూడా ఇద్దరు బతికి బయటపడ్డ సంగతి తెలిసిందే. నేపాల్‌లోని త్రిశూలి 3ఏ ప్రాజెక్ట్ టన్నెల్ నుంచి ఇద్దరిని సహాయక బృందాలు కాపాడాయి. తొమ్మిది రోజులుగా వీరు మృత్యువుతో పోరాడి గెలిచారు. సహాయం కోసం ఎదురుచూసిన వారి ఆశలు ఫలించాయి. అలా బయటపడ్డ ఇద్దరిలో సంజయ్ సాహ్ ఒకరు. ఈ 9 రోజులు తాను 'హరేకృష్ణ మహామంత్రం' జపించినట్లు ఆయన వెల్లడించారు. తొమ్మిది రోజులు తాను సాయం కోసం ఎదురుచూస్తూ, హరేకృష్ణ మహామంత్రం జపిస్తూ ఉండిపోయానని చెప్పారు. ఇక, ఆయనను ఆ శ్రీ కృష్ణుడు జన్మించిన కృష్ణాష్టమి రోజున కాపాడటం విశేషంగా స్థానికులు చెబుతున్నారు. సంజయ్ సాహ్ నేపాల్‌లోని మాదేశ్ ప్రావిన్స్, సప్తారి జిల్లాకు చెందిన వ్యక్తి. అతడు నేపాల్ ఎలక్ట్రిసిటీ అథారిటీలో పని చేస్తున్నాడు. అతడిని నేపాల్ సహాయక బృందాలు గుర్తించిన తర్వాత త్రిశూలిలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ అతడికి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, ఏ ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. మరోవైపు సంజయ్ సాహ్‌తోపాటు టన్నెల్ నుంచి రక్షించిన కబీర్ మహాజన్ కూడా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయనకు కూడా ప్రాణాపాయం ఏమీ లేదని తెలుస్తోంది. ఇంకా అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి



# 'నేరస్థులు బహిరంగంగా ఎలా తిరుగుతున్నారు?

ఒక వీడియో, దానిపై మొదలైన వివాదం, ఆ తర్వాత ఆరోపణలు- ప్రత్యారోపణలు ఇప్పుడు అదే వ్యవహారం పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దారితీసింది. దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనలో కార్యకర్త నిషు ఆజాద్ తండ్రి సంజయ్‌పై దాడి జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో స్వతంత్ర భారద్వాజ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ (జజీూ) నేతలు పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. నిషు ఆజాద్‌కు, ఆమె తండ్రి సంజయ్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జజీూ ప్రతినిధులు పోలీసులను కలిశారు. పార్టీ అధికార ప్రతినిధులు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకా పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. పరిస్థితి తీవ్రత దృష్ట్యా పోలీసులు భారీగా మోహరించారు. ఈ ఘటనకు సంబంధించి కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జజీూ నేతలు డిమాండ్ చేశారు. 'నేరస్థులు బహిరంగంగా ఎలా తిరుగుతున్నారు?' పోలీస్ స్టేషన్ వద్ద మాట్లాడిన ఆశుతోష్ రంకా, జంతర్‌మంతర్ వద్ద జరిగిన ఘటనలో సంజయ్‌పై దాడి జరిగిందని ఆరోపించారు. న్యాయం కోసం చాలా కాలంగా ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఇప్పుడు నేరానికి సంబంధించిన విషయాలను బహిరంగంగా చెబుతున్న పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సంజయ్‌పై దాడి ఘటనలో హత్యాయత్నం కేసు నమోదు చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. సౌరవ్ దాస్ కూడా దిల్లీ పోలీసుల తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. నేరస్థులు దిల్లీలో బహిరంగంగా ఎందుకు తిరుగుతున్నారంటూ ప్రశ్నించారు. జజీూ నిరసన సందర్భంగా కొంతమందిపై దాడి చేశామని కొందరు బహిరంగంగానే చెబుతున్నారని ఆరోపించారు. అమ్మాయిలను కూడా బెదిరిస్తున్నారని అన్నారు. ఈ వ్యవహారంలో పోలీసులు సమాధానం చెప్పాల్సి ఉంటుందని, తాము వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. ఈ ఆందోళనకు ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరామ్) ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్ కూడా మద్దతు తెలిపారు. వైరల్ వీడియోతో మొదలైన వివాదంమొత్తం వ్యవహారానికి కారణం ఓ వైరల్ పాడ్‌కాస్ట్ వీడియో. జంతర్‌మంతర్‌లో జరిగిన ఘటన గురించి స్వతంత్ర భారద్వాజ్ మాట్లాడినట్లు చెబుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. సంజయ్‌పై దాడి చేసినప్పటికీ రాజకీయ పలుకుబడితో జైలుకు వెళ్లలేదన్న భావన కలిగించే వ్యాఖ్యలు అందులో ఉన్నాయని జజీూ నేతలు ఆరోపిస్తున్నారు. వీడియో వైరల్ కావడంతో వివాదం మరింత ముదిరింది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సహా పలువురు ప్రతిపక్ష నేతలు ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ నిషు ఆజాద్‌కు మద్దతుగా నిలిచారు. దిల్లీ పోలీసుల తీరుపై కూడా ప్రశ్నలు సంధించారు.

